గురువుల జేబులు గుల్ల!

కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలపై కక్ష కట్టింది. ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట చేస్తున్న హడావుడితో ఇప్పటికే పలువురు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డగోలు విధానాలతో అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో అవి దయనీయంగా మారాయి. చాక్ పీస్‌లు, డస్టర్లు, కాగితాలు, స్వల్ప మరమ్మతులు, మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు అవసరమైన చీపుర్లు, ఫినాయిల్.. ఇలా ఏ అవసరమైనా ప్రధానోపాధ్యాయులే తమ జేబుల్లో నుంచి డబ్బు తీయాల్సిన పరిస్థితి ఉంది. ఈ వ్యవహారమై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పిల్లల చదువులపైనా సర్కారు నిర్లక్ష్యం

- పాఠశాలల నిర్వహణకు విడుదల కాని గ్రాంటు
- స్కూళ్లు మొదలై రెండు నెలలు దాటినా అదే దుస్థితి
- రోజువారీ ఖర్చులూ ప్రధానోపాధ్యాయుల జేబు నుంచే
- భావి పౌరుల భవితవ్యంతో కూటమి ప్రభుత్వం ఆటలు



సత్తెనపల్లి: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా ప్రభుత్వ పాఠశాలల బాగుపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. వాస్తవానికి స్కూళ్ల అవసరాలకు ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తారు. ఈ అంశాన్ని కూడా ప్రభు త్వం విస్మరించింది. ఫలితంగా ప్రధానోపాధ్యాయులపై ఆ భారం పడుతోంది. ఏడాదికి రెండు సార్లు స్కూలు గ్రాంట్ కింద నిధులు మంజూరు చేయాలి. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు స్టేషనరీ కొనుగోలు, మెయింటెనెన్స్, స్కూల్ గ్రాంట్ నిధులు విడుదల కాలేదు. ఫలితంగా రిజిస్టర్లు, డస్టర్లు, చాక్‌పీస్‌ల కొనుగోలుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. మరికొన్ని చోట్ల సొంత డబ్బు వెచ్చించి వీటిని సమకూర్చుకుంటున్నారు. గతంలో విద్యార్థుల సంఖ్య ప్రకారం మెయింటెనెన్స్, స్కూల్ గ్రాంట్లను ప్రభుత్వం విడుదల చేసేది. ఈ విద్యా సంవత్సరం బడులు తెరిచి రెండు నెలలు దాటినా నిధుల విడుదల విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. సత్తెనపల్లి నియోజకవర్గవ్యాప్తంగా 168 ప్రాథమిక, 18 ప్రాథమికోన్నత, 31 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 20,714 మంది విద్య అభ్యసిస్తున్నారు. వీరంతా ప్రభుత్వ తీరుతో ఇబ్బంది పడుతున్నారు.

ఎప్పటికి వస్తాయో...?

పాఠశాల నిర్వహణ నిధులను ఈ ఏడాది విడుదల చేసేదీ..లేనిదీ.. ప్రభుత్వం ఇంకా తేల్చలేదు. ప్రతి పనికీ ప్రధానోపాధ్యాయులు తమ జేబుల్లో నుంచి తీయాల్సి వస్తోంది. ఈ గ్రాంట్‌ను మంజూరు చేయకపోతే రానున్న రోజుల్లో పాఠశాల నిర్వహణ కష్టమనే భావన వారిలో వ్యక్తమవుతోంది. మరోవైపు తల్లికి వందనాన్ని ఈ ఏడాది ఇచ్చేది లేదని శాసనసభలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రకటించారు. దీన్నే ఇవ్వకపోతే ఇక నిర్వహణ నిధుల సంగతేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాల విద్యాశాఖ ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మెయింటెనెన్స్ గ్రాంట్‌ను త్వరగా విడుదల చేసేలా చొరవ చూపాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

మెయింటెనెన్స్ గ్రాంట్ మంజూరు ఇలా...

విద్యార్థుల సంఖ్య	విడుదలయ్యే మొత్తం(రూ.లలో)
20 లోపు	10,000
21 నుంచి 49 లోపు	15,000
20 నుంచి 100లోపు	20,000
101 నుంచి 250 లోపు	50,000
251 నుంచి వెయ్యి లోపు	75,000
వెయ్యి దాటితే	1,00,000

నాడెంతో ఘనం ...

పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహణ నిధులను నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో మంజూరు చేసేవారు. విద్యార్థులకు ఇచ్చే అమ్మ బడి నిధుల నుంచి రూ. వెయ్యి మినహాయించి పాఠశాలల్లో అవసరమయ్యే ప్రతి వస్తువును కొనుగోలు చేశారు. విద్యాసంస్థలను ప్రారంభించిన వెంటనే ఈ నిధులను విడుదల చేసేవారు. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నీ సమకూరేవి.

క్లుప్తంగా

వరద బాధితులకు ఐద్వా దుస్తులు పంపిణీ



సత్తెనపల్లి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఐద్వా ముందుకు వచ్చింది. 200 మంది వరద బాధిత కుటుంబాలకు 400 చీరలతో పాటు వివిధ రకాల దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు గద్దె ఉమ శ్రీ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరదలు సంభవించి బాధితులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ వారికి చేయూతనందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో 200 కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహిళా నాయకులు గిరిజా, సుధా, శ్రీనివాస కుమారి, మేరీ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన



రాజుపాలెం: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ సహకారంతో రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. సంస్థ మేనేజర్ ఎం.కోమలి మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపరాదని తెలిపారు. హెచ్ఐవీ వలన జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఏఎన్ఎం యలమందమ్మ, మునీషా, శేషు, రీడ్స్ సిబ్బంది, హెచ్ఎం శైలజ, సీహెచ్‌సీ కౌన్సిలర్ నాగేశ్వరరావు, వీహెచ్ఎస్ శాంతివర్ధ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ వైద్యుడిగా పి.ధనుష్



క్రోసూరు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడుగా డాక్టర్ పి.ధనుష్ బుధవారం విధుల్లో చేరారు. చిత్తూరు జిల్లా పుత్తూరు మండల సీహెచ్‌సీ డాక్టర్‌గా చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని , జ్వరాలు వస్తే వెంటనే వైద్యులకు చూపించుకోవాలని కోరారు.

యూ డైస్ ప్లస్‌లో పాఠశాలల సమగ్ర సమాచారం



హెచ్ఎంల శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు, పక్కన ఎంఈఓ-2 రాఘవేంద్రరావు

సత్తెనపల్లి: పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఈనెల 27వ తేదీ లోపు యూ డైస్ ప్లస్‌లో నింపాలని సత్తెనపల్లి ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం అన్ని యాజమాన్య పాఠశాలలకు సంబంధించిన హెచ్ఎంలతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల పూర్తి సమాచారం తప్పులు లేకుండా ఈ నెల 27వ తేదీ లోపు యుడైస్ ప్లస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నింపాలన్నారు. ఎంఈఓ-2 ఎ.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈసారి యు డైస్ ప్లస్‌లో ఎడిట్ ఆప్షన్ లేదని, ఏమైనా తప్పుడు సమాచారం పంపితే హెచ్ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్ఎంటీలు టి.నరేంద్ర, శ్రీకాంత్, ప్రసాద్, ఇందిరా, మల్లేశ్వరి, నీరజ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ వై.ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఈవీ లక్ష్మి పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు



సత్తెనపల్లి: రాజీ పడదగిన కేసులు అన్నీ ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యేలా చూడాలని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయ సేవ అధికార కమిటీ చైర్మన్ సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని పట్టణంలోని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు హాల్లో సత్తెనపల్లిలోని నాలుగు న్యాయస్థానాల పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తి నాగ వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజీమార్గం రాజమార్గం అన్నారు. ప్రజల్లో కక్షలు, కార్పణ్యాలు పెరగకుండా కేసులు తొలి దశలోనే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సమీక్ష సమావేశంలో ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, సత్తెనపల్లి ఒకటవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని, పలు పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, కోర్టు కానిస్టేబుల్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పూర్తిగా చంద్రబాబు వైఫల్యమే

- వరద మరణాలు చంద్రబాబు ప్రభుత్వ హత్యలే
- ప్రభుత్వ తప్పిదం వల్లే విజయవాడలో వరద మరణాలు
- తప్పును కవర్ చేసుకునేందుకే విజయవాడలో ఉండి బాబు ఓవరాక్షన్
- అక్రమ నిర్మాణంలో నివసించే చంద్రబాబుకు వరదలపై మాట్లాడే అర్హతలేదు
- మాజీ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: విజయవాడ వరదల్లో పదుల సంఖ్యలో మరణాలకు మానవ తప్పిదం.. ప్రభుత్వ తప్పిదం.. చంద్రబాబు ముందు చూపులేనితనమే కారణమని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడను వరద ముంచెత్తబోతుందనే వాతావరణ శాఖ ముందస్తు స్పష్టమైన సమాచారం అందించినా చంద్రబాబు నాయుడు ప్రజలను అప్రమత్తం చేయకుండా, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా నిర్లక్ష్యం చేశారన్నారు.

ప్రజలను ఏ మాత్రం అప్రమత్తం చేయకుండా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా బుడమేరు మీద ఉన్న వెలగలేరు రెగ్యులేటరీ గేట్లు ఎత్తడమే వందలాది మంది చనిపోవడానికి ప్రధాన కారణమన్నారు. ఈ తప్పిదం వల్లనే వందలాదిమంది మరణాలు జరిగాయన్నారు. ఈ ఉపద్రవానికి కారణం కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ ముందుచూపు లేని తనమేనన్నారు.

ప్రచారానికే కలెక్టరేట్‌లో మకాం..

స్వార్థ రాజకీయాలు తప్ప పేద ప్రజలు, వారి రక్షణ గురించి ఆలోచించే మనస్తత్వం చంద్రబాబుది కాదని విమర్శించారు. చేసిన తప్పును కవర్ చేసుకునేందుకు చంద్రబాబు విజయవాడలోనే మకాం వేసి ప్రచారయావతో ఓవరాక్షన్ చేస్తున్నాడని, దీని వల్ల ఫలితం లేదన్నారు. కృష్ణానది వరదలకు ముంపు ప్రాంతమైనటువంటి కరకట్ట దిగువున అక్రమంగా నిర్మించిన టువంటి గెస్ట్‌హౌస్‌లో నివసించే ముఖ్యమంత్రి చంద్రబాబుకు వరదల గురించి, వరద ఉధృతి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమంగా నిర్మించిన గెస్ట్‌హౌస్ నివాసాన్ని ఖాళీ చేసి చట్టబద్ధమైన నిర్మాణంలోకి వచ్చి ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

తాగునీరు కూడా అందించలేకపోయారు

వరద బాధితులను ఆదుకోవడంలో, వరదల్లో చిక్కుకున్నవారికి సకాలంలో తాగునీరు కూడా అందించలేకపోయారన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. 2020–22లో కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్నే వణికించిందని, అంతటి విపత్తులో సైతం నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా నియంత్రణ చర్యలు చేపట్టి బాధితులకు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికి సహాయక చర్యలు చేపట్టారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా వరద ముంపుకు గురైన ప్రాంతాల ప్రజలకు నిత్యవసర సరుకులతో పాటు వారికి జరిగిన నష్టాన్ని తీర్చేందుకు ప్రభుత్వం సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు.

వరదల్లో నష్టపోయిన వారందరినీ ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యురాలు గుంటూరు మల్లేశ్వరి

అమరావతి: అతి భారీ వర్షాలు, వరదల వలన నష్టపోయిన రైతులను, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యురాలు గుంటూరు మల్లేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక కామ్రేడ్ తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో నిర్వహించిన సీపీఎం అమరావతి రూరల్ శాఖ ప్రథమ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసభకు సీనియర్ కామ్రేడ్ గుంటుపల్లి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ వరదల వల్ల మండలంలోని వందలాది ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. నీటమునిగిన పంటలకు ఎంత నష్టపరిహారం ఇస్తారో స్పష్టంగా ప్రకటన చేయాలన్నారు. సాగుదారులైన కౌలు రైతులను పంట నష్ట పరిహారంలో నమోదు చేయాలని, అదేవిధంగా మళ్లీ పంటలు వేసుకోవడానికి ఉచితంగా విత్తనాలు, ఎరువులను ఇవ్వాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలు, ఇతర చేతివృత్తుల పేదలు చెల్లించాల్సిన నెలవారి చెల్లింపులను వడ్డీ లేకుండా వాయిదా వేయాలన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడారు. ఈ మహాసభలో అమరావతి రూరల్ శాఖ కార్యదర్శిగా కామ్రేడ్ సయ్యద్ మోహిద్దీన్ వలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం అమరావతి టౌన్ శాఖ కార్యదర్శి బి.సూరిబాబు, నండూరి వెంకటేశ్వరరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు

పొక్లెయిన్‌ను సీజ్ చేసిన తహసీల్దార్



బీరవల్లిపాయ సమీపంలో పొక్లెయిన్ సీజ్ చేసిన తహసీల్దార్

రాజుపాలెం: మండలంలోని బీరవల్లిపాయ సమీపంలోని అసైన్డ్ భూమిలో అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టితవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా పెద్ద పెద్ద పొక్లెయిన్‌లు పెట్టి వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా వేరే గ్రామాలకు మట్టిని తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దుర్గేష్‌రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దారు రాకను గమనించిన అక్రమార్కులు ట్రాక్టర్లను, టిప్పర్లను వేరే మార్గానికి తరలించారు. తహసీల్దార్ క్వారీ వద్దకు వెళ్లే సరికి పొక్లెయిన్ ఒక్కటే ఉండడంతో దాన్ని సీజ్‌చేసి స్థానిక ఎస్ఐ వేణుగోపాల్‌కు ఫోన్ చేసి పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, ఇలాంటి అక్రమ తవ్వకాలను అనుమతించేది లేదని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ట్రాక్టర్లు, టిప్పర్లు విపరీతంగా తిరగడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, సీసీ రోడ్లు పాడైపోతున్నాయని చౌటపాపాయపాలెం పులిచింతల నిర్వాసితులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఊరేగింపులు.. నిమజ్జనాలు

- 5వరోజు వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు
- పలు మండపాల్లో అన్నసంతర్పణలు
- కోలాహలంగా నిమజ్జనానికి గణనాథులు తరలింపు



సత్తెనపల్లి వాల్మీకినగర్‌లో పూజలందుకున్న గణనాథుడు



నాగిరెడ్డిపాలెంలో నిమజ్జనానికి తరలిన గణపతి

సత్తెనపల్లి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా 5వ రోజైన బుధవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు వినాయక మండపాల వద్ద అన్న సంతర్పణలు చేపట్టి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పలు వార్డులు, గ్రామాల్లో వినాయక ప్రతిమలను మేళతాళాలతో ఊరేగించి గుంటూరు రోడ్‌లోని అమరావతి మేజర్ కాలువలో నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా మండపాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించగా .. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా గణనాథుని నిమజ్జనాలు


బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో బుధవారం గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఐదురోజుల పాటు బొజ్జ గణపయ్యకు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. మండలంలోని బెల్లంకొండ యాదవ బజారు, నాగిరెడ్డిపాలెం, న్యూచిట్యాల గ్రామాలలో పూజల అనంతరం ఐదవ రోజున మేళతాళాల నడుమ గణపయ్యను నిమజ్జనానికి తరలించారు. మండలంలోని మరికొన్ని గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు గణపతికి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ముప్పాళ్ల వినాయకుని లడ్డూ ధర రూ.46వేలు

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూ ప్రసాదం రూ.46వేలు పలికింది. బుధవారం నిమజ్జనంలో భాగంగా వినాయకుని లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా, గ్రామానికి చెందిన దండు కొండారెడ్డి రూ.46వేలకు పాడి లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనానికి తరలించారు.



సత్తెనపల్లి పాతబస్టాండ్ సెంటర్‌లో పూజలందుకున్న గణనాథుడు



సత్తెనపల్లి 4వ వార్డు సంగం బజార్‌లో పూజలందుకున్న గణనాథుడు

రూ.30వేలు పలికిన గణేష్ లడ్డూ



గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న నూర్‌బాషా షేక్ మీరా

క్రోసూరు: మండలంలోని అందుకూరు గ్రామంలోని వై.జంక్షన్ యూత్ ఏర్పాటు చేసుకున్న గణనాథుడి లడ్డూప్రసాదాన్ని భక్తుడు నూర్‌బాషా షేక్ మీరా పాడుకున్నారు. 30 కిలోల లడ్డూప్రసాదాన్ని పాడుకుని భక్తుడు భక్తులకు ప్రసాదం పంపిణీ చేసాడు. గణనాథుడిని నిమజ్జనానికి తరలించటం జరిగింది.

‘నోబుల్ టీచర్స్’ నూతన కార్యవర్గం

బెల్లంకొండ: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ బెల్లంకొండ మండల నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు పల్నాడు జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు తెలిపారు. బుధవారం పాపాయపాలెం జడ్పీ పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ నరేష్, ప్రధాన కార్యదర్శిగా కూరపాటి వెంకటేశ్వరరాజు, ఆర్థిక కార్యదర్శిగా బీవీ పద్మావతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

దాడులతో అశాంతిని సృష్టించొద్దు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా దాడులకు పాల్పడి అశాంతి సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు లోనుచేయొద్దని వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. నియోజకవర్గంలో 5 సంవత్సరాలపాటు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తుఫాన్ బాధితులను పరామర్శించడానికి రావడంలో తప్పేముందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నియోజకవర్గంలో తిరగకూడదా అని ప్రశ్నించారు. దాడులతో అశాంతిని సృష్టించడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, అచ్చంపేట గ్రామ సర్పంచ్ షేక్ జాని, ఉప సర్పంచ్ కంబాల వీరబాబు, టౌన్ పార్టీ కన్వీనర్ షేక్ సమరం, షేక్ నాగులు తదితరులున్నారు.

దేశ సంపదను దోచేస్తున్న కార్పొరేట్లు, మతోన్మాదులు

సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య

సత్తెనపల్లి: ప్రజల సంపదను దేశంలో కార్పొరేట్లు, మతోన్మాదులు దోచేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని ముజిఫర్ అహమ్మద్ చౌక్ వద్ద బుధవారం జరిగిన సీపీఎం 16వ వార్డు శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ముజఫర్ ఆహమ్మద్ చౌక్ వద్ద సీపీఎం జెండాను పార్టీ నేత యర్రంశెట్టి వెంకటరావు ఆవిష్కరించారు. పార్టీ నేత షేక్ సైదావలి అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల మధ్య మతోన్మాద చిచ్చు పెట్టి ఐక్యంగా ఉండాల్సిన ప్రజలను మతాల పేరుతో చీల్చి అధికారం కొనసాగిస్తుందన్నారు. దీనికి భిన్నంగా బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకం చేసేందుకు సీపీఎం నిర్విరామంగా కృషి చేసిందన్నారు. ఫలితంగానే గత పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయిందన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ మహాసభలో శాఖ కార్యదర్శి ఎం.హరిపోతురాజు గత మూడు సంవత్సరాల్లో నిర్వహించిన కార్యకలాపాల కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. అనంతరం మహాసభ నూతన కార్యదర్శిగా ఎం.హరిపోతురాజును తిరిగి ఎకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ మహాసభలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు జడ రాజ్ కుమార్ పరిశీలకులుగా పాల్గొన్నారు. శాఖ సభ్యులు సెగ్గెం వెంకటేశ్వరరావు, మొగిలిపాలెపు రమాకుమారి,భూతం భాస్కరరావు, గుంటూరు వేమయ్య, షేక్ జానీ బాష పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



వెంకట రమణ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

పెదకూరపాడు: వృత్తి ధర్మాన్ని పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కాకాని వెంకటరమణ సేవలు నిరుపమానమని టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం రోజు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు పొందిన కాకాని వెంకటరమణను బుధవారం హైస్కూల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జ్ఞాపిక, దుశ్శాలు కప్పి ప్రత్యేకంగా సత్కరించారు. మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు, గళ్ళ బాబు పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అవగాహన పెంచుకోవాలి



గుండ్లపల్లిలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ కె.దేవదాసు

నకరికల్లు: ప్రభుత్వంలోని అన్నిశాఖలకు సంబంధించిన సమాచారాన్ని నిర్ణీత రుసుము చెల్లించి రాతపూర్వకమైన సమాచారం పొందవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలన్నారు. సమాచారం కోసం ప్రభుత్వ శాఖలకు దరఖాస్తు చేసుకొని సమాచారం పొందే విధానంపై అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ తరఫున చేపడుతున్న ఈ-పంట నమోదు రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మూలాధారమని సూచించారు. ఈ-పంట నమోదు పూర్తయ్యాక ఫార్మర్ ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. గ్రామంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది ద్వారా చేపడుతున్న పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈనెల 15వ తేదీలోగా పంటనమోదు ప్రక్రియ పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీమతి సునీత రెడ్డి భర్త బి.ఎస్.రెడ్డి, నివాసం : మాదాపూర్, హైదరాబాద్ గారు, పల్నాడు జిల్లా, అమరావతి మండలం, మునుగోడు గ్రామం వద్ద గల సర్వే నం.లు 53, 55, 122-2, 186 భాగం, 186, 189, 271/A to C భాగం, 277, 289/D భాగం, 287 భాగం, 312 & 325 గల మరియు పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, కస్తల గ్రామంలోని సర్వే నం. 186లో వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి మరియు లేటు శ్రీ గనప రామస్వామి పేరున, తదనంతరం కనుగొనబడిన, ఇతర ఆస్తి/ ఆస్తులు ఏవైనా ఉంటే, వాటికి సంబంధించి లేటు గనప రామస్వామి రెడ్డి తండ్రి లేటు గనప రామకోటి రెడ్డి గారి యొక్క షేర్ హోల్డర్స్‌లో ఆమె ఒకరని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు హెచ్చరికచేయడమైనది మరియు తెలియజేయడమైనది. కొంతమంది విక్రయ ఒప్పందం కుదుర్చుకుని పైన పేర్కొన భూమిని కొనుగోలు చేయుటకు ఉద్దేశిస్తున్నారని మా క్లయింట్‌కి తెలియవచ్చినది. ఒకవేళ ఎవరైనా వ్యక్తి/వ్యక్తులు దానిని కొనుగోలు చేయాలని భావిస్తే, దానికి మా క్లయింట్ బాధ్యులు కాజాలరు. నా క్లయింట్ పైన పేర్కొన్న భూమికి సంబంధించి చట్టవిరుద్ధంగా ఏవైనా నకిలీ పత్రాలు సృష్టించిన/రూపొందించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోబోతున్నారు.

పైన పేర్కొన్న భూమికి సంబంధించి విక్రయ ఒప్పందము (లు) అమలు ద్వారా ఎటువంటి విక్రయ లావాదేవి కుదుర్చుకోరాదని ఇందుమూలంగా సాధారణ ప్రజలను కోరడమైనది. దానికి మా క్లయింట్ బాధ్యులు కారు మరియు అది చెల్లదు మరియు దానిని వారి సొంత నష్టం మేరకు చేసుకోవచ్చు. అట్టి లావాదేవిలకు మా క్లయింట్ ఏవిధంగాను బాధ్యత వహించరు.

సం/- M/s. మలిపెద్ది యాదిరెడ్డి, సి. శ్రీహరి, న్యాయవాదులు
ఇం.నం. 17-1-388/P/35/A, పూర్ణోదయ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్-59.
సెల్ : 9391031369